# వారఫలితాలు

(కథానిక)

రచన:
శ్రీ డి. రామలింగం

పత్రికలు చూచే అలవాటు శాస్త్రికికూడా వుంది. కాని, అన్ని పత్రికలు కాదు. పత్రికలో వున్న వార్తలన్నీ చూచే అలవాటు లేదు. అతను పత్రిక చూచేది వారానికొక రోజు. ఆ చూడడంకూడ వారఫలితాలు మాత్రమే. పత్రిక చేతికి వచ్చినదే తడవుగా వారఫలితాల శీర్షికయే అతనిదృష్టిని గాఢంగా ఆకర్షిస్తుంది.

పత్రికలో వున్న ఇతర విషయాలతో శాస్త్రికి నిమిత్తం లేదు. మిత్రరాజ్య సమితిలో ఏ నిర్ణయాలు జరిగినా, మధ్యప్రాచ్యంలో యెంత మిధ్యగావున్న భారతరాజ్యాంగ పరిషత్తు కార్యక్రమం యెలాసాగిపోతున్నా, దూరప్రాచ్య దేశాలు తమ స్వాతంత్ర్యం కోసం యెట్టి పోరాటాలు జరుపుతున్నా, వాటి పర్యవసానాలు యెలావున్నా శాస్త్రి ఆందోళన పడడు. ముందు తనవిషయం తాను చూచుకోవాలి. తను బాగావుంటేనేగదా యితరుల విషయం ఆలోచించడం. తనబాగోగులు వచ్చే వారఫలితాలలో యెలా వుంటాయో ముందుగా చూచుకోవడం ముఖ్యావసరం శాస్త్రికి.

జీవితం కేవలం అదృష్టంపైన్నే ఆధారపడి వుంటుందని త్రికరణశుద్ధిగా నమ్మేవాళ్లల్లో శాస్త్రి ఒకడు. చేసే క్రియలపైనే ఫలితాలు ఆధారపడి వుంటాయని బల్లగుద్ది వాదించుతూంటే శాస్త్రికి దానిలో రవంతైన సత్యం కనబడదు. వారఫలితాలు ముందుగా చూచుకొని స్పెక్యులేషను కానీ, నూత్నప్రయత్నాలు కానీ, ప్రయాణాలు కాని చేయడం మంచిదని శాస్త్రి సలహాయిస్తే వినకుండా శర్మ బొంబాయి వెళ్లాడు. అక్కడ కొట్లాటల్లో వాడిపిలకపోయింది. ప్రాణం దక్కిందిగదా అని బయటపడ్డాడు. ఇటువంటి ప్రమాదాలేమీ జరగకుండా దైవజ్ఞులు X గారి వారఫలితాలు యెంతైనా ఉపకరిస్తున్నయ్ శాస్త్రికి.

పత్రిక ఇంకా రాలేదేమా అని అనుకుంటూండగానే వచ్చేసింది పత్రిక. వెంటనే చివర పేజీలు తీసిచూచాడు. ఈవారం రెండుపేజీలనిండా వున్నయి వారఫలితాలు. వృశ్చికరాశి పారావతికాదు. ఇలావుంది.

"గ్రహాలు బాగున్నంతమాత్రాన ప్రయోజనం లేదు. మీరుకూడా పూనికతో పనిచేస్తేనే కాని యెంతో కాలంనుంచి కావలసిన కార్యక్రమం నెరవేరదు. ఈవారం గట్టిప్రయత్నం చేయండి. ఆతరువాత ఆశలే వదులుకోవలసివస్తుంది. 5, 6 తేదీలలో ప్రయాణం. వారాంతంతో నూత్నజీవితప్రారంభం."

శాస్త్రి యెన్నోరోజులనుంచి వారఫలితాలు చూస్తున్నాడు. కాని యింతబాగా యెప్పుడూ లేవు. ఒకవేళ బాగావున్నా స్పెక్యులేషను చేస్తే బాగుంటుందనీ, ప్రయాణంవల్ల శుభఫలితమనీ, ఉద్యోగంలో ప్రమోషననీ, కోర్టువ్యవహారాలు అనుకూలంగా పరిష్కారమవుతాయని, ఇంకా ఏవేవో తనరాశిలోనే వ్రాసివుండేవి. వాటివల్ల తనకేంలాభం. స్పెక్యులేషను చేయడానికి వ్యాపారస్తుడు కాదు. ప్రయాణం చేయడానికి పనులేమీ వుండవు. తనకు ఉద్యోగం లేదు మరి ప్రమోషను దేనికి? కోర్టుకుపోవడానికి

తనకేం తనవ్యవహారాలున్నయ్? అవి తనకు సంబంధించినదికాదని అనుకునేవాడు.

ఈవారంలోవచ్చిన ఫలితాలు మాత్రం తన నుద్దేశించే వ్రాయబడి నట్లున్నవి. ఇవాళ పేపరు రూపాయపెట్టికొన్నా నష్టం లేదనుకున్నాడుశాస్త్రి. ఆ ఫలితాలను యెర్రసిరాతో మార్కుకూడా చేసుకున్నాడు. మొదట రెండుపర్యాయాలు చదివాడు. ఆశ్చర్యంగావుంది, మరోసారి చదివాడు, సంతోషం సముద్రంలా పొంగింది. అదృష్టదేవత తనను వెతుక్కుంటూ వచ్చిందని రొమ్ము విరిచాడు.

తను ఇన్నాళ్లనుంచి వాంఛిస్తూవుంది అతిస్వల్పవిషయం. అతిసమంజసమైందికూడా. కాని అదినెరవేరడంలేదు. ఏదైనాప్రయత్నం చేయడానికి తోచదు. ధైర్యంచేసి యేదైనా ప్రయత్నం చేయడానికి వారఫలితాలు నిరాశాజనకంగా వుంటూ వచ్చాయి కాని ఈవారం అలాకాదు.

యదార్థంగా ఆలోచిస్తే, అదృష్టంలో నమ్మకముండి, వారఫలితాలను తు-చ-తప్పకుండా లక్ష్యపెట్టే శాస్త్రికి తనకోరిక ఎప్పుడో ఫలించాల్సింది. కాని కాలం తారుమారుగా వుంది. కాకపోతే ఏమిటి? ఆశర్మ వెధవ. శాస్త్రి క్లాసుమేటు, చూస్తూండగానే బి. ఏ ప్యాసయ్యాడు. మరి శాస్త్రి ఇంకా ఇంటరులోనే పడివున్నాడు. అంతేకాదు. శర్మకు బి. ఏ ప్యాసవగానే ప్రభుత్వంవారు సృష్టించిన కొత్త ఉద్యోగాల్లో ఒక ఉద్యోగం కూడా దొరికింది. అన్నిటికంటె గొప్ప విశేషం, ప్లీడరు భావనారాయణగారి రెండవకూతురు సత్యవతి నిచ్చి వాడికి పెండ్లికూడా చేశారు. వాడి వ్యవహారం పట్టపగ్గాలు లేకుండా వుంది.

శర్మ ఇంతపెద్ద స్థితికి రావడం, అందరూ వాడిని గురించి అనుకోవడం వింటే శాస్త్రికి తలతంపులుగా వుంది. మరీ సత్యవతినిచ్చి పెండ్లి చేయడం శాస్త్రికి సహించరానిది. వాడు సత్యవతిని ఎలా ఆకర్షించాడో అర్థం కావడం లేదు. పోనీ వాడిపూను తనకెందుకూ? తనుకూడా పైకి రాకూడదూ? ఎందుకనీ తనకింత అన్యాయం జరగడం? పోనీ తను బి. ఏ. ప్యాసు కావక్కరలేదు. ఏదో ఇంత ఆస్తివుంది కాబట్టి ఉద్యోగం చేయ నవసరం లేదు. తనకు వున్నది ఒక్కటే కోరిక. ఆ ఒక్కటీ నెరవేరడం లేదు. తనవల్ల పొరపాటేమీ లేదుగా? తనకూ ఆస్తివుంది. తనూ సుందర సుకుమార యువకుడేగా. శర్మలో ఏముందనుంది. వినాయకుడని కాలేజీలో పేరుపెట్టారే? అయినా సత్యవతి వాడిని ప్రేమించిందే? మరి ఈ కమల సత్యవతి తోడిదై కూడా ఏమీ సుముఖత్వం చూపదేం. సత్యవతి క్లాసుమేటయినా ఆ రీతులు, ఆ అలవాట్లు పట్టుబడలేదు ఈ కమలకు.

కమలను గురించి తను ఎంత ఆరాటపడుతున్నాడు. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. తన వల్ల కాలేజీకి దగ్గరైనా ఆ దారిన పోకుండా కమల దర్శనం అవాలని ఆమె వీధిగుండానే పోతాడే. ఎదురుపడినప్పుడు తన కండ్లన్నీ అప్పగించి చూస్తున్నా ఏమీ చలనం కనపడదు ఈ కమలలో. తను చలంగారి ప్రేమలేఖలంత ఉత్తరాలు వ్రాస్తే ఒక్కదానికీ జవాబురాదే. కమల యుక్తవయస్సు. అచ్చుపోసినట్లున్న శరీరపు కదుపు. వినూత్న లావణ్యం తనలో వాంఛను రెకెత్తించాయి. కమల అనే వ్యక్తి తన మనసునంతా ఆక్రమించుకొంది. కాని తనకు వశంగాకుండా వుంది ఈ కమల. శాస్త్రికి ఇది కడు దుర్భరంగా వుంది.

ఇన్నాళ్లనుంచీ వారఫలితాలు బాగా లేవనీ, కొత్త కాబట్టి అతిగా పోకూడదనీ, పరీక్షలు కాబట్టి ఈ ప్రయత్నంలో నిమగ్నుడై వుండకూడదనీ, ఇలాగే ఎప్పటికప్పుడు వాయిదాపడి తాత్సారం జరిగింది. ఈవారం ఇతర ఏ పనులు తనకు లేనప్పుడు, వారఫలితాలు ఇంత ప్రోత్సాహకరంగా వున్నప్పుడు ప్రయత్నం చేయకపోవడం అసమర్థత అవుతుందనుకున్నాడు శాస్త్రి. ఇక ఏమాత్రం కాల

విలంబనం జరగకూడదని నిర్ధారణ చేసుకున్నాడు శాస్త్రి.

అప్పుడే వారంలో ఐదురోజులు గడచిపోయ్యాయి. ఇన్నిరోజులూ ఆలోచనలతోనే సరిపోయింది. ఇక జాగుచేస్తే ప్రయోజనం లేదు. తరుణం మించితే తరుణి జారిపోతుంది. అన్నట్టు ఆరోజే విన్నాడు. కమలకు ఏదో పెండ్లిసంబంధం వచ్చినట్టు. ప్రయత్నాలు కూడా జరుగుతూన్నట్టు. ఇక తను కార్యరంగంలోకి ముందంజ వేయకపోతే తన ఆశలు అడుగంటుతాయి. పూనికతో పని చెయ్యాలని నిశ్చయించుకున్నాడు శాస్త్రి.

మరునాడు ఉదయమే లేచి ప్రయత్నానికి ఉద్యుక్తుడైనాడు. సాయంత్రం 5 గంటల తర్వాత వర్జ్యం పోతుందని వుంది, పంచాంగంలో. ఈలోపుగా తన సన్నాహాలన్నీ పూర్తి చేశాడు. కమలను సంబోధించవలసిన విధం. వెల్లడిచేయవలసిన తన భావాలు, ఆమెను ఒప్పించే నేర్పు అన్నీ ఆలోచించుకొని ఒకమారు రిహార్సలు కూడా చేసుకున్నాడు. రాబోయే దృశ్యం దృష్టికితట్టి పరమానంద భరితుడైనాడు.

సాయంత్రం ఆరుదాటింది. బట్టలు వేసుకొని, టాయిలెటు చేసుకుని, చేతిలో పత్రికతో కమల ఇంటివైపు బయలుదేరాడు శాస్త్రి.

అప్పటికే పూర్తిగా చీకటిపడింది. పూర్ణచంద్రుడుదయించి తనమేలి బంగరు కిరణాలతో రాత్రిని ప్రకాశవంతంగా చేస్తున్నాడు. కమల ఇంటిగేటు వద్దకు వచ్చాడు శాస్త్రి. గేటు దగ్గరకు వేసింది. సమీపంలో ఎవ్వరూ లేరు. ఓరగా గేటుతీసుకొని లోపల ప్రవేశించాడు. ఇంటిముందు భాగంలో వున్న పూలచెట్లు, క్రోటన్సు చంద్రకాంతికి మెరిసిపోతున్నయ్. కమలేకాదు అందమైంది. కమల గదిముందున్న చెట్టు కూడా అందమైనవని అనుకున్నాడు శాస్త్రి.

కమల తూర్పువైపు గదిలో కూర్చుని ఏదో చదువుతూంది. గదిబైట వరండాలో ఎవరూ లేరు. చెట్ల కీనీడల్లోంచి నెమ్మదిగా నడుస్తూ, కమల గదిలోకి ప్రవేశించి గడియపెట్టాడు శాస్త్రి.

తలుపుచప్పుడు విని వెనక్కు తిరిగి తలుపుకేసి చూసింది కమల. శాస్త్రి గడియవేస్తున్నాడు. ఈవిధంగా శాస్త్రి రాత్రిపూట రావడం, వచ్చినవాడు పిలవకుండా గదిలోకివచ్చి గడియపెట్టడం చూస్తే కమల కెంతో ఆశ్చర్యం వేసింది.

"తలుపుగడి ఎందుకు పెట్టావు?" అని కోపంతో ప్రశ్నించింది కమల.

"చెప్తాతా" అంటూ దగ్గరకు వచ్చి కుర్చీకి ఆనుకున్నాడు శాస్త్రి.

శాస్త్రి వాలకం చూస్తే కమల కెంతో భయమూ, అసహ్యమూ వేసింది. చూడబోతే ఏదో దురభిప్రాయంతోనే వచ్చినట్టున్నాడు. ఇంతపని చేస్తాడని కమల ఊహించనే లేదు. మరి అకస్మాత్తుగా జరిగితేనె ప్రమాదం.

చేతిలో వున్న పుస్తకం టేబిలుమీద పడవేసి లేచి తలుపువైపు పోబోయింది కమల. శాస్త్రి అడ్డుపడి చెయిపట్టుకున్నాడు.

"ఏమిటీ పని?" అని గద్దించి చేయి వొదిలించుకుంది కమల.

శాస్త్రి తిరిగి కమల చెయిపట్టుకొని "కమలా, నిన్ను నేను యెంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలిసేవుంటుంది. నీవు నన్ను యెంతో నిర్లక్ష్యంగాచూస్తున్నావు. యెన్నోసార్లు నీతో ఈవిషయం చెపుదామనుకున్నాను. కాని బాగుండదని యెప్పటికప్పుడు నాప్రయత్నాలన్నీ విరమించుకున్నాను. ఇక నేను ఊరుకోలేను. నిన్ను అమాంతంగా ప్రేమిస్తున్నాను. నీవుకూడా సమ్మతించవూ?" అని దగ్గదిక కంఠంతో తగ్గుస్థాయిలో అన్నాడు శాస్త్రి.

కమలకు శాస్త్రి ప్రసంగం వింటూంటే హద్దుమీరిపోతున్నట్టు తోచింది. అందులో రాత్రివేళ, నాన్న క్లబ్బుకెళ్ళాడు. అమ్మ ఎక్కడో వంటింట్లో

మడితోవుంది. తనను ఒంటరిగాచూసి శాస్త్రి ఇలా తయారయ్యాడు. ఎలాగైనా ఈబారినుండి తప్పించుకోవాలి.

"ఇవాళకు యెలావచ్చావో అలా త్వరగా వెళ్ళిపో శాస్త్రీ యెవరైనాచూస్తే ప్రమాదం" అని ప్రాధేయపడింది కమల.

శాస్త్రికిది ఎంతమాత్రం నచ్చలేదు. తనుచేసిన భగీరథప్రయత్నానికీ, ఆశన్నా చూపకుండా, ఏమీ సమాధానం చెప్పకుండా వెళ్ళిపొమ్మంటుంది కమల. ఎలాగైనాచేసి ఇవాళే ఒప్పించాలి కమలను. మళ్లా సమయం దొరకదు. దొరికినా తను ధైర్యం చేయగలడోలేదో. వారఫలితాలు నిరాశజనకంగా వుంటాయేమో ఏదోఒకటి యిప్పుడే తేల్చుకోవాలనుకున్నాడు. శాస్త్రి.

"కమలా, నేనువెళ్ళను. నన్ను ప్రేమించావని సమాధానం చెప్పు" అంటూ కమలను పట్టుకోబోయ్యాడు.

తప్పించుకుని కమల తలుపువైపు పరుగెత్తింది ఆపరుగుచూస్తే శాస్త్రికి హుషారు యెక్కిపోయింది. తనూ పరుగెత్తి కమలను తనరెండు చేతులలోగట్టిగా పట్టుకోబోయ్యాడు.

శాస్త్రి దౌర్జన్యం చేయబోతున్నాడని కమల వూహించింది. మౌనందాల్చితే తను చెడిపోతుంది. మొహాన్ని రెండుచేతుల్తో కప్పిపెట్టుకొని పెద్దపెట్టున కేక వేసింది.

"ఏంటే అమ్మాయి కేకలు" అన్నమాట.

కమలతండ్రి హనుమచ్ఛాస్త్రి గారప్పుడే క్లబ్బునుంచివచ్చారు. శాస్త్రి ఆకంఠాన్ని గుర్తుపట్టాడు. అతనిశరీరం చెమటలుపోసింది. చూపులు తేలిపొయ్యాయి. కమలను పట్టుకున్న చేతులు పండిపట్టుసడలి రాలిపడే ఆకుల్లా కిందపడ్డాయి. ఆపాదమస్తకమూ వణకిపోతున్నాడు శాస్త్రి.

కమల తలుపుతీసింది. హనుమచ్ఛాస్త్రిగారు గదిలోకివస్తూ "ఏమిటీకేకలు" అన్నాడు. కమల తలవంచుకొని ఇంట్లోకెళ్ళింది. శాస్త్రి నిశ్చేష్టుడై తలుపుచాటున నిలబడివున్నాడు. హనుమచ్ఛాస్త్రి గారికి సంగతంతా తెలిసింది. ఆయన ఆగ్రహానికి అంతులేదు. శాస్త్రి గదిలోనేవున్నాడు కదలడానికి కాళ్లుసాగడంలేదు. హనుమచ్ఛాస్త్రిగారు తలుపువేసి, పాలేరునుపిలిచి "పోలీసులను పిల్చుకురా" అని ఆజ్ఞాపించాడు.

పోలీసులు వచ్చారు. కమల ఇచ్చిన వాఙ్మూలం, హనుమచ్ఛాస్త్రిగారి రిపోర్టు వ్రాసుకొని, శాస్త్రిచేతికి సంకెళ్లు తగిలించి "స్టేషనుకు నడువు" అన్నారు.

వారఫలితంలో వున్నట్లు శాస్త్రి ప్రయత్నం సఫలమయినా, కాకపోయినా వారాంతంతో నూతన్న జీవితంమాత్రం ఆరంభమైంది. వారఫలితంలో చివర వున్న 'నూతన్నజీవితం' అంటే ఇదేనేమో అనుకొని వారినమసరించాడు శాస్త్రి.

---

## లండనులో స్నేహప్రభ

ఈమధ్యనే స్నేహప్రభ ఆంగ్లదేశ వీక్షణకు లండన్ వెళ్ళింది. ఈమె గురించి ఇంతవరకు లండన్‌లో చలనచిత్రనిర్మాతలకు తెలియదు. తెలిసి ఉంటే జె. ఆర్థర్ రాన్క్ "ది బ్లాక్ నార్సిసస్" అనే ఆంగ్ల చిత్రంలో నటించడానికి ఈమెను బుక్‌చేసి ఉండునని ఒక పత్రికా ప్రతినిధి విచారించాడు. ఇంతకీ స్నేహప్రభ దురదృష్టం. ఆంగ్ల చిత్రాల్లో నటించే భాగ్యం ఇంకా ఆమెకు లేదు.